ఎగిరిపోయిన సిలక

మృదువైన వాయుతరంగం ఒకటి అందంగా ముంగురులతో చెలగాటమాడి వెళ్ళిపోయింది. తన పలుచని వ్రేళ్ళతో నుదుట పడుతున్న ఆ చిలిపి ముంగురులను వెనక్కు తోసుకున్నది గంగి. రెండవచేతితో తన రంగడి చేతిని గట్టిగా - వదిలితే మళ్ళీ తనకు దొరకడేమోనన్న ఆదుర్దాతో పట్టుకుని నడుస్తున్నది.

వాళ్ళు మొత్తం నలుగురు. ఆ నలుగురికీ ఒక పదేళ్ళ కుర్రవాడు దారి చూపిస్తూ నడిపించుకుపోతున్నాడు. వాడి జుట్టు దుబ్బులా పెరిగి భుజాలమీద పడుతున్నది. వంటిమీద నల్లగా మాసిన మురికి చొక్కా లాగూ ఉన్నాయి వాడికి. నడుస్తూ ఉండి ఉండి మోచేత్తో ముక్కు తుడుచుకుంటు

న్నాడు. వాడిచేతిలోవున్న కర్రను నలుగురూ పట్టుకున్నారు. అందరికంటే చివర గంగి తనవాడి చెయ్యిపట్టుకుని నడుస్తు న్నది.

"ఇంకా ఎంతదూర మెల్లాలి ?" అని అడిగిందామె విసుగ్గా. ఒక్క క్షణంసేపు ఎవరూ సమాధానం చెప్పలేదు. తర్వాత రంగడి దగ్గు వినిపించింది. "అబ్బో ! అప్పుడే ఎక్కడ ? ఇంకా శానాదూరం నడవాలి..." అన్నాడతడు.

దగ్గరలో పెద్ద గుంపు ఏదోచేరి రొదచేస్తున్నది. "అదేందిరా బుచ్చిగా!" అని అడిగాడు, కర్రపట్టుకొని అందరి కన్నాముందు నడుస్తున్న వెంకటేశ్వర్లు. అతడిని చేతిలో వెండి పొన్నులు తొడిగిన ఫ్లూట్ వుంది. అతని కళ్ళు గాజుబిళ్ళల వలె, పత్తికాయలవలె ఉబ్బి ఉన్నాయి.

బుచ్చిగాడు కళ్ళకడ్డంపడుతున్న జుట్టు వెనక్కు విసురు కుంటూ, "సినిమాహాలు... టిక్కెట్లకోసం జనం ఎగబడు తున్నారు" అని చెప్పాడు.

"ఏ సినిమా ఆడతాందిరా ?" అని అడిగాడు రెండవ వాడు. అతని పేరు గోపాలం. అతని భుజంమీద ఘటం ఉంది చేతులకు గజ్జెలు కట్టుకొనివున్నాడు. అతనికి కళ్ళుండ వలసినచోట రెండు గుంటలున్నాయి. మొహంనిండా నల్లని మచ్చలున్నాయి.

బుచ్చిగాడు సమాధానంగా, "ఏమో" అన్నాడు. వాడికి చదువురాదు. పొద్దుగూకులూ ఊరిమీదపడి బలా దూరు తిరుగుతూ ఉంటాడు. వాడి తల్లి బతికివున్నప్పుడు, "సదువుకోరా నాయనా ! సదువుకోకపోతే నీ బతుకూ కుక్కూడా

ఇంతేగా" అంటూండేవాడు. వాడి తండ్రికి కృష్ణ ఒడ్డున పాక ఉంది. అందులో కమ్మరిపని చేస్తూ ఉంటాడతడు. రోజంతా కొలిమిముందు రెక్కలు ముక్కలుచేసుకుని కష్టపడినా రెండుపూటలా తిండికి చాలేదికాదు. భార్య కాన్పు కష్టమై చచ్చిపోయిన తర్వాత బుచ్చిగాడి తండ్రి మరొక మనువు చేసుకొన్నాడు. కొత్తమ్మ ఎప్పుడూ అనవసరంగా రుసరుస లాడుతూ ఉంటుంది. అందుకే బుచ్చిగాడెప్పుడూ ఇంటి పట్టున ఉండకుండా ఊరిమీద తిరుగుతూ ఉంటాడు. ఆకలి అయినప్పుడు ఎక్కడేది దొరికితే అది తినటం, మిగిలిన సమ యమంతా తనబోటి బజారు పిల్లలతో ఆటలాడటం.. వాడికి మామూలు. అప్పుడప్పుడు గుబులు మళ్ళీ ఇంటికి వెళ్ళి కొత్తమ్మచేత చివాట్లు, తండ్రిచేత చావుదెబ్బలూ తింటూ ఉండటంకూడ వాడికి మామూలే. కృష్ణ ఆనకట్ట పక్కన, రోడ్ల పేవ్‌మెంట్లమీదా, తనవంటి పిల్లలతో బొమ్మా బొరుసూ డబ్బులాట ఆడటం వాడికీ మధ్య అలవాటయింది. ఇంట్లో కొత్తమ్మ వాడికి ఒక్క నయాపైసా చిక్కనివ్వదు. తండ్రి ఎదుటపడేందుకే వాడికి ధైర్యంలేదు. ఇక డబ్బు అడిగేదాకా ఎక్కడ? అందువల్ల వాడీ కొత్తకాతా కుదుర్చుకున్నాడు ఇది లాభసాటిగానేవుంది. ఉదయం ఏడెనిమిది గంటల ప్రాంతంలో ఈ నలుగురు గుడ్డివాళ్ళనూ నడిపించుకుంటూ తీసుకువెళ్ళి ఏ సెంటర్లోనో పేవ్‌మెంట్ మీద గుడ్డపరచి పాటకచ్చేరీకి కూర్చోపెట్టటం... వారు అక్కడినుంచి మారాలనుకున్నప్పుడు మరొకచోటికి తీసుకు పోవటం... సాయంకాలం పొద్దు వాలుతూవుండగా తిరిగి

వారిని కృష్ణ ఒడ్డున గుడిసెకు చేర్చటం... ఇదీ వాడి పని. అందుకు ప్రతిఫలంగా రోజూ వాడికి పావలా డబ్బులు దొరుకుతాయి.

గంగికి పరమ చిరాగ్గా ఉంది. "కాళ్ళు పీక్కుపోతా ఉండాయ్. ఎంతసేపని ఇలాగా నడవడం?" అన్నది ఆమె. రంగడు నవ్వాడు. "ఇంకెంతలే నాలుగడుగులేస్తే ఇంటికెళ్ళి పోతాం" అన్నాడు. కొద్దిక్షణాల క్రితమే, "అబ్బో! శానా దూరం నడవాలి" అన్నవాడిప్పుడు "నాలుగడుగులే" అంటు న్నాడు. గంగి రంగడి మణికట్టు తన చేత్తో నొక్కుతూ అలు కతో మూతి విరిచింది.

రంగడి కళ్ళు పైకి మామూలుగానే కనిపిస్తాయి. అతన్ని చూచిన వారెవ్వరూ గుడ్డివాడనుకోరు. అతడు పుట్టిన వెంటనే చూసిన పెద్దలు కూడా అలా అనుకోలేదు. కాని ఏళ్ళు వచ్చేకొద్దీ అతనికి తను గుడ్డివాడిననీ లోకమంతా తనకు చీకటి అనీ తెలిసివచ్చింది మనిషి బక్కపలుచగా అందంగానే ఉంటాడు. అతడు గంగిని ప్రాణాధికంగా ప్రేమిం చాడు ఆమె మృదువైన చేతి స్పర్శ ఉన్నంతకాలమూ అత నికి ఏ దిగులూ లేదు. గంగి నడుస్తూవుండగా ఆమె కాలి మట్టెలూ కడియాలూ చేసే సవ్వడి ఎంత రొదలోనూ అతని చెవులకు మధురంగా వినిపిస్తూనే ఉంటుంది. ఇప్పుడూ వినిపి స్తూనే ఉంది. గంగి ఎప్పుడో సంవత్సరం క్రింతట సంబరపడితే అతడే కొనిపెట్టాడు వాటిని. అవి ధరించినప్పటినుంచీ గంగి తనకు కొద్దిదూరంలో ఎక్కడ తిరుగుతున్నప్పటికీ ఆమె తన దగ్గరే ఉన్నట్లు అనిపించేది. ఆ రెండు నిట్టాళ్ళ వాకలో

ఏ మూల నుంచి ఆ కడియాల చప్పుడు వినిపించినా అతడు ఆ వైపుకే వెళ్ళి ఆమె పక్కనే చేరేవాడు.

ఒక లారీ తమ ప్రక్కనే దూసుకుపోతున్న సవ్వడి విని గంగి భయంతో రంగడికి అతి దగ్గరగా జరిగి అతని చేతిని గట్టిగా పట్టుకున్నది. లారీ వెళ్ళిపోయిన తర్వాత గుండెల మీద చెయ్యి వేసుకుని 'అమ్మో' అనుకుంది. రంగడు నెమ్మదిగా "ఫరవాలేదు లేవే... సంబాళించుకో." అన్నాడు.

రంగడి ముందు నడుస్తున్న గోపాలం చెవులు పాము చెవులు. అతడీ ఆలూమగల సంభాషణ వింటూనే ఉన్నాడు. అతనికీ గంగి కాలిమట్టెలూ, కడియాలూ చేసే అందాల ధ్వని వినబడుతూనేవుంది. అతని మనసులో ఏదో వికారం... ఏదో ఆశ... నిన్న సాయంకాలం గంగి రంగడి చేతిని అందుకోబోయి పొరపాటున గోపాలం చెయ్యి పట్టుకుంది. అతని శరీరం ఒక్కసారిగా జలదరించింది. ఆ చెయ్యి ఎంత మెత్తగా ఉందనీ! అతని మనసు ఏదో తెలియరాని వికారానికి లోనైంది! ఆ గాజుల చేతిని వ్రేళ్ళతో నిమిరాడు. ఇంతలో ఎలా పసిగట్టిందో! గంగి వెంటనే చెయ్యి లాగేసుకుని 'ఒరే ఒరే' అంటూ రంగడికోసం కేకపెట్టింది అంతలో "ఇక్కడే ఉన్నానే సిలకా" అంటూ అతడూ వచ్చాడు. వీళ్ళిద్దరూ మొగుడూ పెళ్లాలుట! అదెటువంటి దాంపత్యమో! అయినా అసలు గంగి ఎలా ఉంటుందో! తనకేమో చూసేందుకు కళ్ళులేవు. నిన్న చెయ్యి పట్టుకున్నప్పుడు తనకు చిత్రమైన కొత్త అనుభూతి కలిగింది. అదే తనకు మొదటి స్త్రీ స్పర్శ!

గంగి నడుస్తూ ఆలోచిస్తున్నది. చూట్టూం ఏవో బస్సులూ, లారీలూ, బండ్లూ చేసే చప్పుడు... అక్కడక్కడ మనుష్యుల కేకలు...అయినా తనకేమీ కనిపించదు. తన కళ్ళముందంతా కటిక చీకటి. మూడేళ్ళ క్రిందటి వరకూ గంగి రైళ్ళలో అడుక్కుతింటూ ఉండేది. ఆమె కెవరూ లేరు. తల్లీ తండ్రీ ఎప్పుడో పోయారు... పైగా గుడ్డిది. అందువల్ల రైళ్ళలో అడుక్కుంటూ జీవితం ప్రారంభించింది. అదీ అంత సులభమైన పనిగా కనిపించలేదు. రోజూ రైల్లో పెట్టె పెట్టెకూ తిరిగి రకరకాల పాటలుపాడి అందర్నీ ప్రాధేయపడి సంపాయించుకున్న చిల్లర డబ్బులు కూడా తరచు దక్కేవికావు. టిక్కెట్టు కలెక్టర్లు పట్టుకుని ఎక్కడ బడితే అక్కడ దింపివేస్తూ ఉండేవారు. అలా కానిపక్షంలో ఏ అల్లరివెధవో దగ్గరచేరి తాను పోలీసునని బెదిరించి ఆ కాసిని డబ్బులూ రాల్చుకునిపోతూ ఉండేవాడు. తనేమో కళ్ళులేని కబోది—భూమిమీద పడ్డప్పటినుంచీ ఈ ప్రపంచం ఎలా ఉంటుందో, తన చుట్టూఉన్నదేమిటో తెలియని దుర దృష్టవంతురాలు. తనకు టి. సి. ఎవరో, మోసగాళ్ళెవరో, పోలీసులెవరో తెలియదుకదా! అలా ఆమె కష్టార్జితం— గొంతు బొంగురుపోయేట్టు పాడి, నలుగురికాళ్లూ పట్టుకుని, 'కళ్ళులేని కబోదిని బాబూ! దిక్కులేని పచ్చిని బాబూ! అనాదజీవితం బాబయ్యా!' అని ప్రాధేయపడి సంపాయించిన డబ్బు చెల్లిపోతూ ఉండేది.

అటువంటి దీనావస్థలో ఆమె రంగణ్ణి కలుసుకున్నది. ఆమె నడుస్తూనే 'వాడి మనసెంత సల్లటిది' అనుకున్నది

అతడు తనను వదలి ఒక్కక్షణంకూడా ఉండలేడనే విషయం తలుచుకున్నప్పుడల్లాఆమెకుఎంతో సంతృప్తి... ఒకసారి రైలు పెట్టెలో "కళ్ళు లేని కబోది పక్షిని బాబూ! దయగల తల్లులు, దయగల తండ్రులు పైసా ధర్మంచెయ్యాండి బాబయ్యా!" అని అడుక్కుంటూ ఉండగా మరొక పక్కనుంచి ఎవరిదో చక్కని గొంతు వినిపించింది. ఎవరో తనలాగే అడుక్కుంటూ బ్రతికేవాడు. చక్కని కంఠంతో 'ఏమి జన్మంబేమి జీవనమూ...' అని పాడుకుంటూ నలుగురినీ తప్పుకుంటూ ముందు ముందుకు వస్తున్నాడు. తాను ఆగిపోయింది. అవతలివాడి గొంతు మంచిది. పైగా ఒకటితర్వాత మరొకటిగా తత్వాలు పాడుతూ నలుగురి సానుభూతీ సంపాయించాడు. మధ్యమధ్య పాట ఆపి గంభీరంగా "దిక్కులేని జన్మం బాబయ్యా! మీ కాళ్ళకాడ బతకాల్సిన అనాదులం బాబయ్యా! ఒక్క పైసా ధర్మం..." అంటున్నాడు. చివరకు 'సూడ కళ్లులేవు నారాయణా' అని పాడటం ప్రారంభించాడు. గంగి అతని గురించి 'నాలాటోడే నన్నమాట...' అనుకున్నది. అలాగే ఒక్క నిముషంసేపు వింటూ నిలబడింది. ఇంతలో టి. సి. కాబోలు వచ్చి తనను చివాట్లుపెట్టి క్రిందికి దింపివేశాడు. అతన్నికూడా దిగమన్నాడేమో 'దిగుతున్నాను బాబూ!' అంటున్నాడతడు.

రైలు వెళ్ళిపోయిన తర్వాత ఏర్పడిన ప్రశాంత వాతావరణం చూస్తే ఆ స్టేషను చాలా చిన్నదని అనిపించింది. పక్షులు గూళ్ళకు చేరేవేళ. దిక్కులేని పక్షులు నీడ వెతుక్కుంటూ వెళ్ళేవేళ... చల్లని వర్షపుగాలి విసురుగా

వీస్తున్నది. గంగి తడువుకుంటూ స్టేషను వెలుపలికి వెళ్ళి కూర్చున్నది. పైన మేఘాలు గర్జిస్తున్నాయి. ఉండి ఉండి ఎక్కడో ఏదో పక్షి కూస్తున్నది. కొద్ది నిముషాలలో తన నెవరో తరుముకు వస్తున్నట్లు వర్షం పడటం ప్రారంభించింది గంగి గబగబాలేచి తడువుకుంటూ ముందుకువెళ్ళి గోడపక్కన చూరుక్రింద నిలబడింది. కళ్ళులేని కబోది బ్రతుకు, ఒంటరివేళ ... ఏదో తెలియని చిన్న స్టేషను ... పైనుంచి కుండపోతగా వాన.. గంగి కప్పటికి పదిహేడు సంవత్సరాలు ... ఆమెకు దుఃఖం పొరలివచ్చింది. మాసిన పమిట కొంగు ముఖానికి కప్పుకుని 'మా అమ్మ నెత్తుకుపోయావు... మా నాన్న నెత్తుకు పోయావు... నన్నెందుకు ఎత్తుకుపోవు భగవంతుడా !...' అనుకుంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

భగవంతు డప్పుడు ఏ తొందరపనిలో ఉన్నాడో తెలియదుకాని రంగడుమాత్రం అక్కడే ప్రయాణీకులు కూర్చునే హాలులో ఒక ప్రక్కన కూర్చుని రాగాలు తీస్తున్నాడు. అతనికి వర్షపుజల్లు చేస్తున్న రొదమధ్య ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న సవ్వడి వినిపించింది. ఒక్కసారిగా తన కూని రాగాన్ని ఆపి "ఎవరు" అని అడిగాడు. గంగి ఆ ప్రశ్ననివిని ఏడుపు ఆపి నిశ్చలంగా కూర్చుండిపోయింది. అతడు మళ్ళీ "ఎవరది ? మాట్లాడరేం?" అన్నాడు.

గంగి మాట్లాడలేదు. రంగడు "ఎవరూ లేరేమో లెమ్మ"నుకుని మళ్ళీ కూనిరాగం అందుకున్నాడు. కంఠస్వరం వినగానే గంగికి అనుమానం కలిగింది. ఇందాక రైలు పెట్టెలో తారసిల్లిన వాడేమో ననుకున్నది.

వర్షం పెద్దదయింది. గాలీ వాన కూడబలుక్కుని స్వైరవిహారం చేస్తున్నాయి. జల్లు మరీ విసురుగా కొడుతున్నది. గంగి పూర్తిగా తడిసిపోయింది. ఇక అక్కడ అలా నుంచుంటే లాభంలేదు ఆమె కాళ్ళతో చేతులతో తడువుకుంటూ ఒక మెట్టుఎక్కి ప్రయాణీకుల కోసం కట్టిన ఆ చిన్న హాలులో అడుగుపెట్టింది. అక్కడ కూడా పరిస్థితి అలాగేవుంది. రంగడు ఒకమూల చేరాడు. అక్కడ బాగానేవుంది. అతడు గళ్ళదుప్పటి నొకదాన్ని మోకాళ్ళచుట్టూ కప్పుకుని కూర్చుని 'స్వర్గలోకం పోదమంటే మార్గమేదిర అన్నయో ..." అంటూ పెద్దగా పాడటం మొదలుపెట్టాడు

గంగి అనుమానం తీరిపోయింది. రైల్లో తారసపడిన వాడేనని నిర్ధారణ చేసుకుని అక్కడే గోడకానుకుని కూర్చున్నది. బయట వర్షపుహోరు... ఉండి ఉండి ఉరుముల భయంకరధ్వని, ఎక్కడో పిడుగుపడిన చప్పుడు...రంగడు తనలో తాననుకుంటున్నట్టు 'మా బలేగా ఉందిలే వాన...' అన్నాడు.

ఇంతలో స్టేషనుమాస్టరు కిటికీలోనుండి చూశాడు. హాలుమధ్య గాలివిసురుకు వూగుతూ ఆరిపోయేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మందంగా వెలుగుతున్న దీపం వెలుతురులో ఆయనకు ఇద్దరు మనుషులూ కనిపించారు. ఏదో బండి వచ్చే వేళ...అందువల్ల ఆయన టిక్కెట్లకోసం ఎవరైనా ఉన్నారేమోనని అలా చూశాడు ఒక మూల వెచ్చగా దుప్పటి కప్పుకుని కూర్చున్న గుడ్డివాడు ఆయనకు పరిచితుడే...అత

డింతకుముందు రెండుసార్లు బండ్లోనుంచి దింపివేయబడి ఇలాగే కాలక్షేపంచేశాడు. అటువంటి సమయాలలో అతని పాటల రొద ఆయనకు తెల్లవార్లూ ఉండి ఉండి వినిపిస్తూనే ఉంటుంది. మరొకపక్క వానకు నిలువెల్లా తడిసి నీళ్ళు కారుతూ చలికి గడగడ వణుకుతూ కూర్చున్న గంగివంక చూసి ఆయన "అమ్మాయ్! నువ్వేటువైపు వెళ్ళాలి?" అని అడిగాడు.

రంగడి పాట ఆగిపోయింది. అతడు చెవులప్పగించి వింటున్నాడు. ఏ సమాధానమూ వినరాలేదు. స్టేషను మాస్టరు చిరాకుతో "అడుగుతూ ఉంటే సమాధానం చెప్ప వేం?...సరే అలాగేకూర్చో...నా సొమ్మేం పోయింది..." అని తిరిగి తన పనిలో లీనమైపోయాడు.

ఇంతలో పోర్టరు కిటికీలోనుంచి చూసి "ఆ పిల్లను నే నింతకుముందు తెనాలి స్టేషనులో చూశానండీ. గుడ్డిది... అడుక్కుంటూ ఉంటుంది..." అని చెప్పాడు. స్టేషను మాస్టరు ఒక్క క్షణంఆగి "ఓహో!"అని మాత్రం అని మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు.

తర్వాత ఎవరూ మాట్లాడలేదు. స్టేషనుమాస్టరు గదిలోంచి ఏదో శబ్దం అప్పుడప్పుడు మాత్రం వినవస్తున్నది. ఒక రైలు రొదచేసుకుంటూ వచ్చి అక్కడ ఒక అరనిముషం సేపు మాత్రమే ఆగింది. నిజానికి అదీ అనవసరమే... అక్కడ ఒక్క పురుగుకూడా దిగలేదు. ఆ అరనిముషం తర్వాత నిశ్శబ్దం ఘనీభవించింది.

రంగడు అలాగే కూర్చున్నాడు. ఎందుకో ఏమీ పాడటంలేదు. ఒకసారి మాత్రం "ఇప్పుడు బీడీ ఒకటి ఉంటే ఎంత బాగుండును" అనుకున్నాడు. వెంటనే "లేకపోతే ఏం? బ్రతకలేనా" అనుకున్నాడు కూడా.

గంగి గోడకు తలానించి అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నది. మనసులో ఏమిటో గుబులుగా భయంగా ఉంది... ఇటీవల ఆమె నిలాగే ఎక్కడో చిన్న స్టేషనులో దింపి వేశారు... అక్కడ దిక్కూ తెన్నూ తోచక ఒక స్తంభాని కానుకుని కూర్చున్నది... ఎవడో ఆమె దగ్గరికి వచ్చి జాలి పడి ఏదో మాట్లాడుతూ అక్కడే కూర్చున్నాడు. కొంత సేపటితిర్వాత చుట్టుపక్కల ఎవరూ లేరేమో తెగించి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె పెద్దగా కేకపెట్టింది. అవతలి వాడు భయపడిపోయి ఎటో జారుకున్నాడు. ఆ పక్కన ఎక్కడో కునికిపాట్లు పడుతున్న పోర్టరెవరో వచ్చి "ఎందుకమ్మాయ్ అలా గావుకేక పెట్టావు?" అని అడిగాడు. ఆమె అబద్ధమాడింది. "ఏదో పీడకల" అన్నది. పోర్టరు నవ్వి "బాగానే ఉంది... దోవకడ్డంగా ఉన్నావిప్పుడు... కొంచెం పక్కకుజరిగి కూర్చో..." అని చెప్పి వెళ్ళిపోయాడు. అదృష్టవశాత్తు అతడెవరో మేలుకొని ఉండబట్టి సరిపోయింది... లేకపోతే వాడేంచేసేవాడో...

పక్కన రంగడు దగ్గి సర్దుకు కూర్చున్నాడు. బాగా పొద్దుపోయినట్లుంది. వర్షం ఇంకా పడుతూనే ఉంది. ఉరుములు తగ్గనేలేదు.

గంగికి మాగన్నుగా నిద్రపట్టింది. అలాగే గోడకానుకుని నిద్రపోయింది. రంగడికి నిద్రపట్టలేదు. మళ్ళీ “ఒక బీడీ ఉంటే ఎంత బాగుండు” ననుకున్నాడు. అంతలోనే “పోన్లే... లేకపోతే మానె” అని కూడా అనుకున్నాడు. తనకు కొద్ది దూరంలో ఒక ఆడపిల్ల తనలాగే కబోది, కూర్చుని ఉన్నదని అతనికి అర్థమయింది. అతని మనసు పరిపరివిధాలపోయింది. ఎవరో ఆ పిల్ల? ఎలా ఉంటుందో!

అర్ధరాత్రి సమయంలో మళ్ళీ ఏదో రైలు దారుణంగా చప్పుడుచేసుకుంటూ వచ్చి ఆ స్టేషనులో ఆగింది. గంగికి మెలకువవచ్చింది. మళ్ళీ ఆ రొద అణగిపోయి ప్రశాంతత వ్యాపించిన తర్వాత ఆమె మనసులో ఏదో దిగులు బయలుదేరింది. చుట్టూ అంధకారం చిక్కగా ఘనీభవించి తనను నొక్కివేస్తున్నట్టు బాధ ... బయట జల్లుపడుతున్న ధ్వని ... గంగికి మళ్ళీ ఏడుపు పొంగివచ్చింది.

ఇంతలో దగ్గర్లో ఎక్కడో విపరీతమైన ధ్వనితో భయంకరంగా పిడుగుపడింది. గంగి కెవ్వుమని కేకవేసి లేచి పక్కకు నడవబోయి తూలిపడింది. రంగడు ఉలికిపడి తన మీద తూలిపడిన ఆ పిల్లను పొదివిపట్టుకున్నాడు. గంగి భయంతో వణికిపోతూ ప్రవాహంలో మునిగిపోతున్నవాడు దొరికిన ఏ కొయ్యముక్కనో చివరి ఆశతో పట్టుకున్నట్టు అతని భుజంమీద తల ఆన్చి ఉండిపోయింది.

భయంతో ఏడుస్తున్న ఆ పిల్ల వీపునిమురుతూ రంగడు ఏమనడానికీ తోచక నిశ్చలంగా కూర్చుండిపోయాడు. కొద్ది నిముషాల తర్వాత అలా ఏడుస్తూనే గంగి నిద్రపోయింది.

రంగడు తాను రవ్వంత కదిలితే ఆ పిల్లకు ఎక్కడ నిద్రా భంగం అవుతుందో అన్నట్టు కదలకుండా స్తబ్దంగా కూర్చు న్నాడు.

రకరకాల పక్షులు రొదచేస్తూ కులాసాగా గూళ్లువిడిచి రెక్కలు తపతప కొట్టుకుంటూ బారులుతీరి ఎగిరిపోతూ ఉండగా గంగికి మెలకువవచ్చింది. ఆమె లేచి పరిసరాలను అర్థంచేసుకుని సర్దుకుని కూర్చుంది. ఇప్పుడామె మనసెంతో ప్రశాంతంగావుంది.

రంగడు లేచి "ఉండు ... ఇప్పుడే వస్తాను" అని చేతిలో కర్రతో తడువుకుంటూ వెళ్ళి తనదగ్గర ఉన్న గిన్నెలో నీళ్ళు పట్టుకువచ్చి ఇచ్చాడు. అతని భుజానవున్న జోలెలో నిత్యావసరమైన సామగ్రి చాలావుంటుంది. ఆమె చేతిని పట్టుకుని పళ్ళపొడి ఇచ్చి మెట్లుదింపి "మొహం కడు క్కుని కూర్చో..బయటకెక్కడకేం... నే నెల్లి తింటాని కేమన్నా పట్టుకొస్తాను... నా కిక్కడ అంతా ఎరకేలే. "అని చెప్పాడు. ఆమె 'సరే' అనగానే, స్టేషనుకు దగ్గరలో, పెద్ద చెట్టుకింద ఉన్న పాకహోటలుకు కర్ర తాటించుకుంటూ వెళ్ళాడు.

గంగి మొహం కడుక్కుని కూర్చున్నది. ఎందుకో ఆనాడు ప్రతిరోజూ మనసులో గూడుకట్టుకునివుండే దిగులూ ఒంటరితనమూ మాయమైనట్టనిపించింది. ఎవరో తనను ఆద రిస్తున్నట్టు, అభిమానిస్తున్నట్టు అనుభూతి కలిగింది.

ఆ తర్వాత ఇద్దరూ చాలా మాట్లాడుకున్నారు... హృదయాలు విప్పి పరస్పరం ఆదరభావంతో ప్రేమగా ముచ్చటించుకున్నారు. స్టేషను మాష్టరు కిటికీలోనుంచి

చూసి ఆశ్చర్యపోయి "ఏమిటో! దిక్కు లేనివాళ్ళకు దిక్కు తేసి వాళ్ళే గతి..." అనుకున్నాడు.

ఇక ఇద్దరూ తర్వాత నెలల తరబడి కలిసికట్టుగా రైళ్ళలో అడుక్కుంటూ కాలం గడిపారు. గంగి ఎంత సమ్మర్దంలో నడుస్తున్నప్పటికీ రంగడి చెయ్యి వదిలేదికాదు. ఇంత ప్రపంచమూ తన కళ్ళకు లేనట్టే...రంగడి చెయ్యిమాత్రం తనకు సర్వస్వమనిపించేది. అతని చల్లని మాటలూ, అతడప్పుడప్పుడు చెప్పే చమత్కారపు కథలూ, అతని తీయని పాటలూ చాలుననిపించింది. ఒకనాడు ఎవరో తమను రైల్లో నుంచి దింపివేశారు. అక్కడ అసలు నిజానికి స్టేషనులేదు. ఒక పాత రైలుపెట్టె స్టేషనుగా చలామణి అవుతున్నది. నర సంచారం అంతగాలేదు. దగ్గర్లో ఏ ఊరూలేదు. చుట్టుప్రక్కల కనుచూపుమేర అంతా పొలాలు...పండు వెన్నెల కాస్తున్నదేమో శరీరానికి చల్లని కిరణస్పర్శ తగులుతున్నది. చల్లని గాలి ఎక్కడెక్కడినుంచో పొలాలమీదుగా, కొండల మీదుగా, మట్టి దిబ్బలమీదుగా, రాళ్ళూరప్పలమీదుగా అలలు అలలుగా హాయిగా వీస్తున్నది.

రంగడూ, గంగీ రైల్లోనుంచి తమను దింపివేసినందుకు లేశమూ తంకూడా దిగులుపడలేదు. ఒక్క క్షణంసేపు నిలబడి రైలు కదిలిపోగానే ఒకరివెంట ఒకరు పరుగులెత్తుతూ ఆడుకోవటం ప్రారంభించారు. రంగడు గంగికి దూరంగా "అలదాని కౌగిట్లో మరణించినా చాలు చందమామా!" అని పాడుకుంటూ నడిచిపోతున్నాడు. గంగి గొంతెత్తి పిలుస్తూ అతని వెంటబడి నడుస్తున్నది. రంగడేదో చెట్టుక్రింద ఆగాడు.

గంగి అతన్ని సమీపించి చెయ్యిపట్టుకుని ఒక్క క్షణం ఆగి "ఒరే! చందమామ ఎలావుంటాడంటావు?" అని అడిగింది. రంగడు గంగిని దగ్గరికిలాక్కున్నాడు. "ఇలాగుంటాడు" అని తన రెండు చేతులతో ఆ పిల్లమొహం తనవైపుకు తిప్పుకున్నాడు. గంగి నిలువెల్లా సిగ్గుతో కుంచించుకుపోయింది. రంగడి గొంతులో మార్పువచ్చింది. 'గంగీ' అన్నాడు మత్తుగా, ఆమెను మరింత దగ్గరికి తీసుకుంటూ. 'ఊ'అంటూ గంగి అతని కౌగిలిలో ఒదిగిపోయింది. పైనుంచి తమమీద పడిన పువ్వును రంగడు చేతిలోకి తీసుకుని తడివిచూసి "ఇది నిద్రగన్నేరు పువ్వు..." అన్నాడు. ఆ పువ్వు మెత్తగా పల్చగావుంది. గంగి మత్తుగా కళ్ళుమూసుకుని అతని వక్షం మీద తలవాల్చి ఏమీ పలకకుండా ఉండిపోయింది.

ఆనాటి మొదలు వారిద్దరూ భార్యాభర్తలైనారు. జీవితం మాత్రం రైల్లోనే... అడుక్కున్నందువల్ల వచ్చే డబ్బులన్నీ మూటగట్టి దగ్గర ఉంచుకునేవారు. ఎక్కడ ఆకలయితే అక్కడ ఏదో తినటం... ఎక్కడ నిద్రవస్తే అక్కడ పడుకోవడమూగా ఉండేది వారి జీవితం.

తర్వాత క్రమక్రమంగా రంగడికీ అలా రైళ్ళలో తిరగడం నచ్చలేదు. "మనమా, కబోదులం. తిరుగుతున్నది రైళ్ళలో. ఏనాటికేమో? అందుకని ఈ పద్ధతే మంచిదికాద" న్నాడతడు. తర్వాత ఒకనాడు తెనాలి ప్లాట్‌ఫారంమీద ఉత్సాహంగా వచ్చి గంగిని కూకోబెట్టుకుని 'ఒక పెద్ద ప్లాను వేశామే సిలకా... ఇప్పుడే వెంకటేశ్వర్లని మనలాటోడే తారసపడ్డాడు. వాడికి ముందూఎనకా ఎవరూ లేరంట..

బెజవాడలో కృష్ణ ఒడ్డున వాడికొక పాకవుందని చెప్పాడు... వాడితో మాట్లాడి పనంతా రైటుచేసుకొచ్చేశాను...' అన్నాడు. గంగి తరచితరచి అడిగి వివరాలన్నీ తెలుసుకుంది. ఆ వెంకటేశ్వర్లు ఫ్లూట్ వాయిస్తాడట. "బాగానే వాయిస్తా ఉన్నాడు. అక్కడికెళ్ళి స్థిరపడి ముగ్గురం కబోదులం కలిసి అడుక్కుంటే సరి..నువ్వూ నేనూ పాడతాం ... వాడేమో ఫ్లూట్ వాయిస్తాడు. బెజవాడ మహాపట్నంలో మన కడుపు నిండకపోద్దా...పిచ్చిదానా..లెగు." అన్నాడు రంగడు. గంగి సరేనన్నది. ఇంతలో ఆ వెంకటేశ్వర్లు వచ్చాడు. ముగ్గురూ కలిసి బెజవాడ వచ్చేశారు...తర్వాత ఈ మధ్యనే గోపాలం కూడావచ్చి వారిలో చేరాడు. బుచ్చిగాడు వారిని పొద్దున్నే తీసుకువెళ్ళి ఏ సెంటర్లోనో కూర్చోబెట్టిన తర్వాత నలుగురూ పాటకచేరీ ప్రారంభిస్తారు. గంగీ, రంగడు రకరకాల పాటలు నేర్చుకున్నారు. వాళ్ళిద్దరూ పాడుతూవుంటారు. వెంకటేశ్వర్లు ఫ్లూట్ వాయిస్తాడు. అతనిలో కొంచెం పాండిత్యం కూడా ఉంది. గోపాలం చేతికి గజ్జెలు కట్టుకుని ఘటం వాయిస్తాడు. అలా నలుగురూ పక్కపక్కన కూర్చుని కలిసికట్టుగా పాటకచేరీ చేస్తారు. మధ్యమధ్య వెంకటేశ్వర్లు చుట్టూచేరిన వారి నుద్దేశించి "కళ్ళులేని కబోదులం బాబూ! తోచింది ధర్మంచెయ్యండి మారాజా! దయగల తల్లులు, దయగల తండులూ ఫుట్టంధులకు పైసాపడెయ్యండి, నాయనలారా.." అంటూ ప్రాధేయపడతాడు. చుట్టూ నిలబడినవారు తోచిన వారు తోచినంతగా వారి ముందున్న గుడ్డమీద విసిరి వెళ్ళిపోతారు.

అందర్నీ ప్రత్యేకంగా ఆకర్షించేది వారు నలుగురూ గుడ్డివాళ్ళు కావటం...కలిసి తమ విద్య ప్రదర్శించటం...

గంగి బుచ్చిగాణ్ణి తమ్ముడివలె ఆదరిస్తుంది. వాడి మీద ఆమెకు అవ్యాజమైన సోదరప్రేమ కలిగింది. వాణ్ణి దగ్గరికి తీసుకుని కబుర్లూ, కథలూ చెబుతూ ఉంటుంది. వాడు 'కొత్తమ్మకంటె, గుడ్డిదైనా గంగి మేలు' అనుకున్నాడు. తనకు అక్క-చెల్లెళ్ళెవ్వరూ లేరు...గంగిని 'అక్కా-' అని పిలుస్తూ పనులలో సహాయం చేస్తూవుంటాడు.

గుడిసెలో అడుగు పెడుతూనే గంగి "బుచ్చీ! నిప్పుపెట్టె తీసుకురా...పొయ్యి అంటించు...పొద్దుపోయింది..." అన్నది.

*　　*　　*

ఆ పాక రెండు భాగాలుగావుంది. మధ్యలో మేదరి తడికె...కుడివైపు భాగంలో గంగీ బుచ్చిగాడు పొయ్యి ముందు కూర్చునివున్నారు. పొయ్యిలో పుల్లలు టపటపలాడుతున్నాయి. బుచ్చిగాడు పొయ్యిలోమంట ఇవతలికి రాకుండా పుల్లలు సర్దుతున్నాడు.

"అలదాని కౌగిట్లో మరణించినా చాలు చంద మామా" అని పాడుతూ రంగడు లోపలికి వచ్చి నిలబడి "సిలకా, సిలకా" అని పిలిచాడు. గంగి మారుపలకలేదు. పరధ్యానంగా అలాగే కూర్చున్నది. రంగడు పొయ్యి గమనిస్తూ, ముందుకువచ్చి గంగి జెడ పట్టుకున్నాడు. ఆమె ములిదు ఉలికిపడి 'ఎవరు?' అన్నది. రంగడు "నేనే లేవే,

కంగారుపడకు..." అన్నాడు జెడవదలి. "ఏమిటా మోట సరసం. బుచ్చిగాడున్నాడు..." అన్నది గంగి మళ్ళీ.

బుచ్చిగాడు నవ్వి "అక్కా! ఇందాక నీ సీరెలన్నీ సిరిగిపోయాయన్నావుగా! మరి ఇప్పుడు చెప్పవేం కొనిపెట్టమని?" అన్నాడు

గంగి, "ఆ! పోదూ! ఇంతోటి అందానికి రంగు రంగుల సీరెలు కావాలేంటి?" అన్నది. రంగడు నవ్వి, "ఒరే బుచ్చీ! మీ అక్క ఏమిరంగో చెప్పరా!" అని అడిగాడు. బుచ్చిగాడు చేత్తో జుట్టు పైకి విసురుకుని, "ఏందయ్యోయ్ మంచిరంగేలే" అన్నాడు.

గంగి సిగ్గుపడింది. "పొండి! ఇద్దరూ ఇద్దరే. ఇక్కణ్ణుంచి లేచిపొండి..." అన్నది జరిగిపోతూ. ఆమెకూ మొదటిసారి తన ఒంటిరంగు తెలిసి వచ్చింది. రంగడెన్నో సార్లు తామిద్దరూ ఒంటరిగా కబుర్లు చెప్పుకొంటున్నప్పుడు అలా అడిగాడు కాని తనకు మాత్రం ఏం తెలుసు? తను ఎరుపో నలుపో ఎవ్వరూ ఎప్పుడూ తనకు చెప్పలేదు.

రంగడు తడికె నానుకొని ఆలోచనలో పడ్డాడు. "కళ్లు లేవనేగాని దాని అందం మా గొప్పది. దాని మనసంతకంటే గొప్పది గదూ. నాకు కళ్లు లేవు. కబోది పక్షిని అయినా గంగి నాకు అన్నినూ. ఎనక జల్మంలో ఏ పున్నెమో చేశాను. అందుకే దాని సావాసం అబ్బింది. లేకపోతే ఎందుకీ ఎదవ జన్మ. కుణ్ణలోపడి చచ్చేవాణ్ణి కదూ" అనుకున్నాడు.

ఇంతలో మిగిలిన ఇద్దరూ వచ్చారు... వెంకటేశ్వర్లు మంచివాడు. అతని కంఠమూ మెత్తనిదే. అతడు "నది బాగానే వస్తావుంది" అంటున్నాడు.

గోపాలం నలుగురిలో ఒకడుగా బ్రతుకుతున్నాడే కాని ఎప్పుడూ ఏమీ మాట్లాడడు. మరీ అంత అవసరమై నప్పుడు బదులు పలికి తేకూడా గొప్పే. మిగిలిన ముగ్గురూ చక్కగా మనసులువిప్పి మాట్లాడుకుంటూ ఉంటే తనేమో ఎప్పుడూ నిశ్శబ్దంగా కూర్చుని ఉంటాడు. ఒక్కొక్కప్పుడు గంగీ, రంగడూ ఏదో వాదన వేసుకుంటారు. ఆ వాదన తెగదు. వెంకటేశ్వర్లు ఎప్పుడూ గంగి పక్షమే. "మా చెల్లెలు చెప్పిందే రైటు" అంటూ ఉంటాడతడు గోపాలం ముంగిలా కూర్చుంటాడేతప్ప ఏమీ మాట్లాడడు. అసలక్కడ అతను ఉన్నాడో లేదో కూడా ఈ ముగ్గురికీ తెలియదు. రంగడా వాదనలో ఒంటరివాడైపోతాడు. గంగి మాటే నెగ్గుతుంది. చివరకతడోడిపోయి "మీ అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒకటైతే ఇక నేనేం సెయ్యగల్ను? మీగు చెప్పిందే వేదం అవుద్ది..." అనేవాడు.

ముగ్గురూ తిండి ముగించి వాకిట్లోకి వెళ్ళిపోయారు. బుచ్చిగాడు మిగిలిన అన్నమూకూరా గంగిముందు గిన్నెలో ఉంచి అన్నీసర్దేసి "నే నెల్లిపోతున్నాను..." అనిచెప్పి పరిగెత్తు కుంటూ వెళ్ళిపోయాడు.

గంగి తిండి ముగించి వాకిట్లోకి వచ్చేసరికి చల్లని వెన్నెల శరీరానికి హాయిగా తగిలింది. గుడిసె ముందున్న వసారాకూడా తడికెతో రెండు భాగాలుగా విభజించబడి

వుంది. ప్రక్కనుంచి వెన్నెల వసారాలో కొంతమేర పడు తున్నది. రెండోపక్క గోపాలం తనపక్క పరుచుకుని చుట్ట కాల్చుకుంటున్నాడు. అతని చెవులకు గంగి కాలిమట్టెలూ కడియాల సవ్వడి వినిపించింది. వెంకటేశ్వర్లు ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. అతడు పెద్దతరహా మనిషి. చుట్టు పక్కలవారిని పరామర్శించి వారితో పిచ్చాపాటీ వేసి వస్తూవుం టాడు. ఇక రంగడు అప్పటివరకు గంగికోసం ఎదురుచూసి అప్పుడే వెన్నెలలో కృష్ణ మెట్లమీదకు వెళ్ళి నిలబడ్డాడు కూనిరాగం తీస్తూ.

గంగి ఆవులించి ఒళ్ళు విరుచుకున్నది. ఆమెకు నిద్ర ముంచుకుని వస్తున్నది. అలాగే పక్కమీద పడుకుని కళ్ళు మూసుకుంది. చుట్టుపక్కల అంతా నిశ్శబ్దంగావుంది. వెంక టేశ్వర్లుకూడా వచ్చి పడుకుని అప్పుడే నిద్రపోయినట్టున్నాడు.

రంగడు వచ్చాడు. పక్కనే పడుకొని, "సిలకా" అని పిల్చాడు మీద చెయ్యివేస్తూ. "ఉండేశ్! పొద్దుణ్ణించీ ఒకటే తిరుగుడు...వొళ్ళంతా తీపులుగా ఉంది. నిద్రొస్తా వుంది...నువ్వూ పడుకో..." అన్నది మత్తుగానే. రంగడు మరోవైపుకి తిరిగి కళ్లుమూసుకు పడుకున్నాడు.

*　　　*　　　*

మరునాడు వారు నలుగురూ ఎక్కడికీ బయలుదేర లేదు వెంకటేశ్వర్లుకు జ్వరం తగిలింది. అతడు పొద్దున్నే మామూలుగా లేవలేకపోయాడు. ఒళ్ళంతా కండరాలు పిండుతున్నట్టు నొప్పులుగావుంది. గంగీ, రంగడూ తన చెంత వచ్చి నిలబడగా గడగడ ఒణుకుతూ, "జరం తగిలినట్టుంది

చెల్లమ్మా ..వొళ్ళంతా తీపులు...నిన్నసాయంకాలంనదివొడ్డున తెగతిరిగాను ...నాకాగాలిపళ్ళేసు''అన్నాడు. వారానాడింటి దగ్గరేఉండిపోయారు. గంగి వెంకటేశ్వర్లుకు సర్వోపచారాలు చేసింది. వెంకటేశ్వర్లు ఉండి ఉండి మూలుగుతూ "ఆఁ! మామూలు జొరమేలే. సాయంకాలానికి జారిపోద్ది. మరేం బెంగపడకండి'' అంటున్నాడు.

గోపాలం తెల్లవారుజామునే ఎక్కడికో వెళ్ళి ఇంత వరకూ రాలేదు. గంగీ రంగడూ తిండిముగించి కాస్సేపు కూర్చున్నారు. ఇంతలో బుచ్చిగాడు పరుగెత్తుకుంటూవచ్చి "జరం ఇంకా తగ్గలేదా ?" అని అడిగాడు. వెంకటేశ్వర్లు ఆ ప్రశ్నవిని నవ్వుకుని 'అప్పుడే ఎక్కడ ? మనమీద దయ దలచి వచ్చిన జరం ఒకరోజయినా ఉండకుండా ఎట్లా ఒదులుద్ది ?'' అన్నాడు.

రంగడు మధ్యాహ్నంవేళ బుచ్చిగాణ్ణి దగ్గరికి పిలిచి "మాతో బజారుకు వస్తావురా బుచ్చీ!'' అని అడిగాడు. వాడు తల ఊపుతూనే "ఎక్కడికి ?'' అని అడిగాడు

రంగడు వెంకటేశ్వర్లు నుద్దేశించి "మీ చెల్లమ్మకు సీరె కొనాలయ్యా! దాని సీరెలన్నీ చిరిగి పీలికలై పోయాయట..." అన్నాడు.

వెంకటేశ్వర్లు "అట్లాగే ఎల్లండి... దాన్నికూడా ఎంట తీసుకుపో...'' అంటూ మూలుగుతూనే లేచి తడువుకుంటూ వెళ్ళి గుడిసెలో మూలగా నేలలో పాతిపెట్టబడిన కుండలో నుంచి డబ్బులు లెక్కపెట్టి తీసి రంగడికి ఇచ్చాడు... అది ఎనిమిది రూపాయల చిల్లర...

రంగడు డబ్బు బనియను జేబులో వేసుకుని తడికె ఇవతల నుంచుని "సిలకా రావే...గబగబ ఎల్లాలి మనం..." అన్నాడు. గంగి వెంకటేశ్వర్లకు బియ్యపు జావ కాస్తున్నది. ఆమె తలెత్తి అటువైపు తిరిగి "ఎక్కడికి?" అని ప్రశ్నించింది. బుచ్చిగాడు "నీకు సీరె కొంటాడంట...నన్ను రమ్మన్నాడు బజారుకు..." అన్నాడు.

గంగి, "నేను రాను. అవతల జరం మనిషి నొదిలిపెట్టి బజారు కెల్లాలంట." అన్నది. రంగడికి కోపం వచ్చింది. "సరే...రావద్దులే.." అంటూ అవతలికి రెండడుగులు వేశాడు.

వెంకటేశ్వర్లు అంతా విని రంగణ్ణి ఉద్దేశించి "నీ కసలు ఏమీ తెలవదురా... నువ్వుండు.. నేను చెప్తాను..." అని "చెల్లమ్మా" అని కేక వేశాడు.

గంగి "ఆఁ" అని బదులుపలికి జావ పట్టుకువచ్చి "ఇదుగో అన్నా, జావ తాగు. పొద్దుణ్ణుంచీ ఏమీ తినలేదు నువ్వు..." అన్నది. వెంకటేశ్వర్లులేస్తూ "చూడు చెల్లమ్మా! నీ చీరెలన్నీ చిరిగిపోయాయంటగా... నువ్వూ వాడూ బుచ్చిగాణ్ణి ఎంటబెట్టుకుని బజారు కెళ్ళిరండి... డబ్బు ఆడి చేతికిచ్చాను..." అన్నాడు.

గంగి ఏమీ పలకలేదు. వెంకటేశ్వర్లు చెప్పినదానికామె ఎన్నడూ ఎదురు చెప్పదు. ఇప్పుడూ చెప్పలేదు. పక్కకు వెళ్ళి గోళ్ళతో తల కొంచెం దువ్వుకొని చీరె సవరించుకుని తయారై ఇవతలికి వచ్చింది. బుచ్చిగాడు "అక్క వచ్చింది పదవయ్యా" అన్నాడు. రంగడి మొహం వికసిం

చింది. బుచ్చిగాడు దోవచూపించగా ఇద్దరూ గుడిసె బయటికి వచ్చి నడవటం ప్రారంభించారు.

మధ్యలో రంగడు నెమ్మదిగా 'సిలకా సిలకా' అన్నాడు గంగి నవ్వుకుని "ఓరి ఉండరా... నీ సిలక నీ పక్కనే ఉంది. ఎటూ పోలేదు రాడీవోడా..." అన్నది.

ముగ్గురూ జనసమ్మర్దమైన వీథులలో నడిచివెళ్ళి బుచ్చిగాడు చూపించిన పాత బట్టలమ్మే దుకాణం ముందు నిలబడ్డారు. అక్కడ అటువంటివే నాలుగైదు దుకాణాలున్నాయి. వాటిలో పాత చీరెలూ, ధోవతులూ, చొక్కాలూ, ప్యాంట్లూ అన్నిరకాలైనవీ దొరుకుతాయి.

బుచ్చిగాడు "సీరలున్నాయా ?" అని అడిగాడు, ఒక చోట నుంచుని. అక్కడి మనిషి నల్లనివాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

బుచ్చిగాడి ఆదుర్దాచూసి అతడు "నీకేనా ?" అని అడిగాడు తెల్లని పళ్ళికిలించి నవ్వుతూ. బుచ్చిగాడు జుట్టు వెనక్కు విసురుకుని "నాక్కాదు. అదుగో మా అక్కకు...' అన్నాడు అక్కడే నిలబడిన గంగినీ, రంగణ్ణీ చూపుతూ.

ఆ మనిషి ముందుకువంగి వారినిచూసి "అయితే తీసుకురా... బోలెడు రకాలున్నాయి.." అని చెప్పాడు. బుచ్చిగాడు ఇద్దర్నీ నడిపించుకుని తీసుకు వచ్చాడు. ఇద్దరూ నేలమీద కూర్చున్నారు. రంగడు దగ్గి "చీరెలు మంచివి చూపించండి మంచిరంగులు...ఎర్రటోళ్ళకు సరిపడే రంగులు" అన్నాడు. గంగి అతన్ని మోచేత్తో పొడిచింది.

దుకాణదారుడు అరడజను చీరెలు వారిముందు పడేసి తాపీగా ఒక్కొక్కదాన్నే చలువ మడతలువిప్పి రంగులు వర్ణించి ఖరీదులు చెప్పాడు. "న్యాయమైన రేట్లే చెప్పాను. మరి బేరంలేదు .." అన్నాడుకూడా.

బుచ్చిగాడు నెమలి కంఠం రంగు చీరెను ఎన్నిక చేశాడు. దుకాణదారుడు తలవూపి "అవును. అది బాగానే ఉంది. చుట్టూ జరీకూడా ఉంది. అయిదురూపాయలు..." అన్నాడు.

గంగి చేత్తో చీరెను పట్టుకుని చూసింది. 'నెమలి కంఠం రంగు! నెమలి ఎట్లా ఉంటుందో! నెమలి కంఠం మరెట్లా ఉంటుందో!' అనుకున్నది.

ఇంతలో రంగడు "ఆ రంగు ఈ అమ్మాయికి బాగుంటదా బాబూ!" అని అడిగాడు. దుకాణదారుడు "దివ్యంగా ఉంటుంది" అన్నాడు మిగిలినవి మడతలువేస్తూ. బుచ్చిగాడు కూడా "అవును బలేగా ఉంటాది... మా కొత్తమ్మకూ్కడా ఇట్లాంటిదేవుంది" అన్నాడు.

చివరకు ఆ చీరెనే కొన్నారు. దుకాణదారుడు డబ్బు తీసుకుని ఆ చీరెను కాయితంలో కట్టియిచ్చి వారు వెళ్ళి పోతూ ఉంటే అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు.

గంగి ఒకచేత్తో రంగడి చెయ్యి గట్టిగా పట్టుకుంది. మరొకచేత్తో చీరె పట్టుకుంది. రంగడు బుచ్చిగాడి చెయ్యి పట్టుకున్నాడు. అలా ముగ్గురూ చాలాదూరం నడిచివచ్చారు. నదీప్రవాహంమీది గాలి హాయిగా వీస్తున్నది. బుచ్చిగాడు

ఆగి "ఇదే బ్యారేజీ..." అన్నాడు. రంగడు "అంటే?" అని అడిగాడు.

"అంటే రోడ్డు వంతెన...ఆ చివరిదాకా కట్టారు. అయిగో లారీలు, బస్సులూ పోతుండాయిగా..." అన్నాడు బుచ్చిగాడు. వారిద్దరినీ అక్కడే తీసుకుపోయి నిలబెట్టాడు.

అక్కడ అటూ ఇటూ మరెవరూ లేరు. ముగ్గురూ బ్యారేజీమీద పిట్టగోడ నానుకుని నిలబడ్డారు. కృష్ణవేణి ఉరుకులు పరుగులుగా ప్రవహించివస్తున్నది. అవతల అంత ప్రశాంతంగానూ, గంభీరంగానూ ప్రవహించి వచ్చేనది వంతెన ఇవతల విపరీతమైన రొదచేస్తూ చెదిరిపోతున్నది. అటూ ఇటూ కొండలూ, మధ్యలో పాదరసం మడుగులా నది. ఇటువైపు లాకులలో పడి నీరు రొదచేస్తున్నది. దూరంగా రైలు వంతెనమీద ఏదో గూడ్సుబండి చప్పుడు చేసుకుంటూ పోతున్నది. సూర్యుడస్తమించబోతున్నాడొకవైపు. చంద్రబింబం గబగబ పైకి వచ్చేస్తున్నది మరొకవైపు..ఎర్రని రాగిరంగు కాంతులు ప్రశాంత ప్రవాహం మీద పడి నీరు రంగులు రంగులుగా కనబడుతున్నది. అన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పాడు బుచ్చిగాడు. ఆ వంతెన ఎట్లా కట్టారో, లాకులంటే ఏమిటో వివరంగా చెప్పాడు. "ఇంకా వరద వస్తాదంట. రేడియోలోకూడా చెప్పారు" అన్నాడు చివరకు.

రంగడూ, గంగీ అలాగే నిలబడిపోయారు. వారికి తెలుస్తున్నదల్లా నదిమీది గాలి, లాకులలో చిక్కబడి నీరు చేస్తున్న రొద...అంతే.

గంగి గాలికి నుదుటిమీద పడుతున్న ముంగురులను తన పల్చని వ్రేళ్ళతో వెనక్కు నెట్టుకుంది. రంగడి చెయ్యి వదలనేలేదు.

ఆ పక్కనే నడివయసు వ్యక్తి నిలబడ్డాడు. అతడు వీరిద్దరినీచూసి, "మీరు పాటలుపాడుతూ ఉంటారుకదూ!" అని అడిగాడు. రంగడు ముందు 'తనను కాదేమో లెమ్మ'ను కున్నాడు, బుచ్చిగాడు 'నిన్నేనయ్యా' అన్న తర్వాత సర్దు కుని "అవును బాబూ" అని చెప్పాడు.

ఆయన కాస్త ఆగి "ఒకనాడు నేను 'ఎనక జల్మము లోన ఎవరమో నంటి' అనే పాట పాడమన్నాను. పాడి విని పించావు. ఇప్పుడు మళ్ళీ ఒకసారి పాడి వినిపిస్తావా?" అని అడిగాడు.

రంగడు నవ్వుకుని "అట్టాగే బాబూ" అని గొంతు సర్దుకున్నాడు. గంగికి మరుక్షణంలో తనవాడి కంఠస్వరం వినిపించింది. తియ్యని పాట. మనసును కదిపే పాట...

"ఎనక జల్మములోన ఎవరేమోనంటి, సిగ్గొచ్చి నవ్వింది సిలకనాఎంకి" అవును. ఎనకజన్మలో ఎవరో తాను? ఎంత పాపిష్టిజన్మమో అది! తానెవరి కళ్ళు పొడిచి గుడ్డి వాళ్ళను చేసిందో!

'ముందు మనకే జల్మముందోలె యంటి, ఎలా తెలా బోయింది ఎర్రినా ఎంకి" ముందు ఏ జన్మమయినా కబోది జన్మం వద్దు. రంగడులేని జన్మవద్దు.

"ఎన్నాళ్ళో మనకోలె ఈ సుకములంటి. కంట నీరెట్టింది జంట నా ఎంకి." రంగడి చల్లని మనసే, వాడి

చల్లనిమాటే ఉండాలిగాని తన కంతకంటె కావలసిన సుఖమేముంది ?

ఆ పెద్దమనిషి అలా నిశ్చలంగా నిలబడి రెండు మూడు నిముషాలసేపూ ఆ పాట విని చలించిపోయాడు. ఆయన కళ్లు నీళ్ళతో నిండి తళతళలాడాయి. జేబులోంచి చేతికి వచ్చిన నోటు తీసి రంగడి చేతిలోవుంచి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. బుచ్చిగాడు "అది రెండు రూపాయల నోటు..." అన్నాడాశ్చర్యంతో.

గంగి నిట్టూర్చింది. రంగడు "ఎవరో మారాజు... ధర్మప్రభువు." అన్నాడు.

ముగ్గురూ ఇంటికి వచ్చారు.

* * *

వసారాలో తన కాళ్ళమీద చల్లని వెన్నెలపడుతూ ఉండగా ఆ రాత్రి చాలాసేపు రంగడు గంగితో కబుర్లు చెప్పాడు. "కొత్త చీరెలో బలేగున్నావే..." అన్నాడు. "పెళ్ళికూతురు కళ వచ్చిందే నీకు..." అన్నాడు.

గంగి కదలకుండా పడుకున్నది. రంగడు మాట్లాడుతూ ఉంటే, ఆ కంఠస్వరం వింటూ ఉంటే పారవశ్యం కలుగుతున్నది. కళ్ళు మూతలు పడిపోతున్నాయి. చల్లని గాలికి ప్రాణాలెటో షికారు పోతున్నాయి.

చాలాసేపు మాట్లాడి రంగడు గంగి నిశ్శబ్దంగా ఉండటం గమనించి నెమ్మదిగా 'గంగీ' అని పిలిచాడు. గంగి బదులు పలకలేదు. 'నిద్రపట్టింది మొద్దుకు' అనుకున్నాడు రంగడు.

అతనికి చాలుగా బీడి కాలుద్దామని కోరిక కలిగింది. నెమ్మదిగా లేచాడు వెంకటేశ్వర్లు గుడిసెలో పడుకున్నాడు. గోపాలం ఇంకా రాలేదు.

రంగడు నెమ్మదిగా కఱ్ఱ తాటించుకుంటూ వెన్నెల్లో నడిచి ఇవతలికి వచ్చాడు. దూరంనుంచి నదిమీది గాలి చల్లగా వీస్తున్నది. అతడు ముందు ఒక్క క్షణంసేపు మొదటి మెట్టుమీద నిలబడ్డాడు. కఱ్ఱతో తడివి రెండో మెట్టుమీదికి దిగాడు. మళ్ళీ అలాగే తడివి మూడో మెట్టు దిగాడు. ఇక దిగకూడదు. నీళ్ళు మరి నాలుగైదు మెట్లు కింద ఉన్నట్టు చప్పుడునుబట్టి తెలుస్తున్నది. అతడు మెట్టుమీద పొట్టిగోడ నానుకుని కూర్చున్నాడు. బనియను జేబులోంచి తాను గంగికి తెలియకుండా దాచివుంచిన బీడీ తీసి ముట్టించు కున్నాడు. గబగబ నాలుగైదు దమ్ములు పీల్చాడు. తర్వాత కొద్ది నిముషాలపాటు "ఎనక జన్మములోన..." అని పాడు కున్నాడు. తర్వాత ఆవులించాడు. చల్లనిగాలి జోకొడు తున్నట్టు మెత్తగా వీస్తున్నది. క్రింద నీళ్ళు మెట్లను తగిలి మృదువైన శబ్దం చేస్తున్నాయి. రంగడికి నిద్ర ముంచుకుని వచ్చింది. పై గుడ్డ చెవులచుట్టూ కప్పుకుని, లేచివెళ్ళే ఆలో చన కూడా లేకుండా అలాగే గోడకానుకుని కళ్ళు మూసు కున్నాడు. మరి కొద్ది క్షణాలలోనే అతనికి గాఢమైన నిద్ర పట్టింది

*　　*　　*

అర్ధరాత్రివేళ కొద్దిగా తూలుతూ కఱ్ర తాటించు కుంటూ నడిచి వచ్చాడు గోపాలం. పొద్దున తన నెరిగివున్న

అవిటి వాడొకడు అతన్ని పలకరించి ఎక్కడికో తీసుకువెళ్ళి విందుచేశాడు. సాయంకాలంకూడా అతడు గోపాలాన్ని వదల లేదు. ఎవరో రహస్యంగా నడుపుతున్న కల్లుపాకకు తీసుకు పోయాడు. అక్కడ నాటుసరుకు దొరుకుతుంది. దిట్టంగా తాగారిద్దరూ.ఒకపక్క వెంకటేశ్వర్లను తలుచుకుంటే బాధగా, భయంగా ఉన్నప్పటికీ అతడు తెచ్చికోలు ధైర్యంతో నడిచి వచ్చాడు. తీరా వసారాలో చూస్తే తన పక్క అలాగే వుంది. వెంకటేశ్వర్లు లేడు. "బహుశా జ్వరం తగ్గలేదేమో! లోపలే పడుకుని ఉంటాడు" అనుకున్నాడు.

కొద్దిగా తూలుతూనే పక్క పరుచుకున్నాడు. నడుం వాల్చాడు. నిద్ర పట్టేట్టులేదు. మనసంతా ఏదో వికారం... కల్లుపాకలో మళ్ళీ గాజుల చెయ్యి తగిలింది. అది అతన్ని కుదిపివేసింది. గంగి చెయ్యిలాగే ఉందదికూడా.

గంగి గుర్తుకురాగానే అతనిలో అశాంతి చెలరేగింది. ఏమిటో నరాలు జివ్వున లాగుతున్న తపన. అతడు బలవంతంగా నిద్రపోదామనుకున్నా లాభంలేకపోయింది. నిద్ర సహాయనిరాకరణం చేసి అతన్ని బాధపెడుతున్నది. పక్కన అంతా ప్రశాంతంగావుంది. ఎక్కడా ఏ అలికిడీలేదు. నది హోరు వినిపిస్తున్నది. రాత్రివేళ విహరించే ఏదో పక్షి చిత్రంగా అరుస్తూ ఎగిరిపోతున్నది.

అతడు లేచాడు. తూలుతూ తడికె పక్కకువెళ్ళి నిల బడ్డాడు. శ్వాసకూడా బిగబట్టి మెత్తగా అడుగులువేస్తూ నెమ్మదిగా ముందుకు నడిచాడు. నేలమీద గొంతుకూర్చుని చేతులతో తడిమాడు. గంగి కాలి కడియాలు చేతికి తగి

లాయి. అటూ ఇటూ చేతులతో కలయవెదికాడు. గంగి ఒక్కతే పడుకునివుంది. మంచి నిద్రలో ఉంది.

అతడామె పక్కనే పడుకున్నాడు. క్రింద చాప ఒరుసుకుంటున్నది. కాళ్ళమీద చల్లని వెన్నెల పడుతున్నది గంగి ఒకపక్కకు పొర్లి అతనిమీద చెయ్యివేసింది. మట్టి గాజులు గలగలమని మృదువుగా చప్పుడుచేశాయి.

గోపాలం ఇక ఆగలేకపోయాడు. ఒక చెయ్యి గంగి చుట్టూవేసి దగ్గరికి లాక్కున్నాడు. గంగి అభ్యంతర పెట్ట లేదు. అలాగే మత్తుగా నిద్రలో అతన్ని పెనవేసుకున్నది. గోపాలం మరింత కామంతో ఆమెను గుండెలకు అదుము కున్నాడు. ఆమె మగతగా కళ్ళుమూసుకుని ఉండి మత్తుగా "అబ్బ! ఏంటిరా అంత కక్కుర్తి? ఎన్నడూ ఎరగనట్టు... బీడీ తాగొచ్చావా... పాడు వాసన..." అంటూనే అతనికి లొంగిపోయింది.

ఆకాశంలో అంతవరకూ ఉజ్వలంగా కాంతులు వెద జల్లుతూ ప్రకాశించిన చంద్రబింబం నల్లని పొదవంటి ఒక మబ్బులో చిక్కుబడిపోయింది. వెన్నెల మందగించింది.

కొద్ది సేపటితర్వాత గోపాలం లేచి ఇవతలికి వచ్చాడు. గంగి అలసటతో నిద్రాభారంతో మరొకవైపుకు తిరిగి పడుకుంది. గోపాలం శరీరమెంతో తేలికపడ్డట్టుగా ఉంది. మనసులో ఒక మూల తప్పు చేశాననే భావం మెదులుతూనే ఉంది. తెల్లవారుతుంది. తన తప్పు బయట పడుతుంది. అప్పుడేంకాను? వెంకటేశ్వర్లను తలుచుకుంటే గుబులు గుబులుగా ఉంది.

అతడు తన పక్క మీద లేచి కూర్చున్నాడు. నిద్ర పట్టడంలేదు. మెదడంతా ఆలోచనలతో వేడెక్కి అతన్ని చికాకు పరచింది. అతడలా ఒక గంటసేపు ఆలోచించి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు. నెమ్మదిగా లేచి పక్క చుట్టుకుని చంకలో పెట్టుకున్నాడు. కర్ర అందుకున్నాడు. తర్వాత నెమ్మదిగా అడుగులువేస్తూ తన కలవాటయిన దారివెంట నడిచిపోయాడు.

*　　　*　　　*

తెలతెల వారుతూ ఉండగా రంగడికి మెలకువ వచ్చింది. చల్లని గాలి రివ్వున వీస్తూ శరీరాన్ని అలుము కుంటున్నది. నది మరొకమెట్టు పైకి వచ్చింది. ప్రవాహంలో వడి హెచ్చింది. ఎక్కడెక్కడి నుంచో సుళ్ళు తిరుగుతూ వచ్చి వేగంగా అతి తీవ్రంగా దూకిపోతున్నది నది. కొత్త బిచ్చగాడెవరో మెట్లమీద నిలబడి అప్పుడే తలనిండా స్నానంచేసి కూర్చుని చిన్న అద్దం ముక్కలో మొహం చూసుకుంటూ నుదుట నామాలు దిద్దుకుంటున్నాడు.

రంగడు ముందు ఆశ్చర్యపోయాడు. తర్వాత నవ్వు కుని కర్ర తాటించుకుంటూ మెట్లెక్కి పైకి వచ్చాడు. మెట్ల ప్రక్కన పెద్ద చెట్టు గుబురుకొమ్మలలో పక్షులు దారుణంగా రొద చేస్తున్నాయి.

అతడు గబగబ నడిచివెళ్ళి 'సిలకా సిలకా' అని పిలి చాడు. గంగి లోపలినుంచి 'ఓయ్' అని బదులు పలికింది. వెంకటేశ్వర్లింకా నిద్ర లేవలేదు.

రంగడు గంగి దగ్గరగావచ్చి "చూశావంటే, రాత్రంతా మెట్లమీదేపడి నిద్రపోయాను. మా బలేగా నిద్ర పట్టిందిలే. తస్సదియ్య..." అన్నాడు.

గంగి అతని చెయ్యి అందుకుంది. "ఏ మెట్లమీద..?" అని అడిగింది. "నది మెట్లమీద...రాత్తిరి నువ్వేమో నేను మాట్లాడతావుండగానే నిద్రకుపడ్డావు. నాకు నిద్ర రాలేదు. వూరికే అట్టా కాసేపు కూచునొద్దామని ఎల్లాను. బీడీ తాగేందుక్కాదు...ఒట్టు ... కావాలంటే నోరు వాసన చూడు, అంతే అక్కడే నిద్రపట్టేసింది. ఇప్పుడే లేచొస్తున్నాను" అన్నాడు రంగడు.

గంగి అనుమానంతో "అర్ధరాత్రికాడ నువ్వు రాలేదా?" అని అడిగింది. రంగడు విసుక్కుని "నీకు భగవంతు డేమాత్రమూ తెలివితేట లియ్యలేదే ... నేనేం అరవంలో సెప్తున్నానా! అర్థంకావటంలేదా ఏటి? రాత్రి నువ్వు పండుకోగానే ఎల్లాను, హాయిగా మెట్లమీద నిద్రపోయాను ఇప్పుడే వస్తావుండాను" అని వివరంగా చెప్పి బయటికి వెళ్ళాడు.

గంగి గుండెలు దడదడలాడాయి. మనసులో గుబులు బయలుదేరింది. భయంకూడా కలిగింది. సగం రాత్రివేళ రంగడు రాలేదా? అయితే ఎవరొచ్చారు? ఆ పొగాకు వాసన ఎవరిది?

ఆమె మనసు విచలితమైపోయింది ఆమెకు గోపాలం గుర్తువచ్చాడు. అతడు గుర్తుకురాగానే ఆమె శరీరం ఆపాదమస్తకమూ ఒక్కసారిగా జలదరించింది. తనమీద తనకే

విపరీతమైన అసహ్యం కలిగింది. అలాగే కూలబడిపోయింది. కొద్ది క్షణాలలో ఎన్నాళ్ళక్రితమో ఆమెను వదిలిపెట్టి మరుగైపోయిన దుఃఖం పొరలివచ్చింది. మొహాన నెమలి కంఠం రంగు చీరకొంగు కప్పుకుని ఏడుస్తూ చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది.

తర్వాత లేచి ఇవతలికి వచ్చింది. తనమీద తనకే విపరీతమైన అసహ్యం... కోపం... శరీరంలో అగ్ని దాగి ఉన్నట్టు అంత చల్లని గాలిలోనూ ఒళ్ళు సెగలు కక్కుతున్నది. మనసు కుతకుతలాడిపోతున్నది.

అలా ఎంతదూరం నడిచివెళ్ళిందో ఆమెకే తెలియదు. పాదాలకు చల్లని నదీప్రవాహం తగిలేవరకూ ఆమెకు ఒళ్ళు తెలియదు.

నది వేగంగా, కసిగా సుళ్ళుతిరుగుతూ, బుసలు కొడుతూ ప్రవహిస్తున్నది. ఎన్ని ఊళ్ళను జలమయంచేసి ఎన్ని పొలాలను ముంచివస్తున్నదో ఆ ప్రవాహం! రంగడు కొనిపెట్టిన మట్టెలు, తర్వాత కడియాలూ నీటిలో మునిగి పోయాయి మోకాలివరకూ చల్లని ప్రవాహం వచ్చింది. మసిలిపోతున్న శరీరానికి చల్లగా మంచుకప్పినట్టున్నాయి నీళ్ళు. ఆమె శరీరమూ, మనస్సూ అధీనంలోనుంచి తప్పి పోయాయి.

* * *

ఇంటికి తిరిగివచ్చిన రంగడికి గంగి మట్టెలూ, కడియాల చప్పుడు వినబడలేదు. రోజూ ఆ వేళకు గంగి గుడిసె బయట చిమ్మి నీళ్ళుచల్లి ముగ్గులు పెడుతూ ఉంటుంది.

అతడు "సిలకా" అని పిలుస్తూ గుడిసెలోకి అడుగు పెట్టాడు. గంగి బదులు-పలకలేదు. వెంకటేశ్వర్లుకు మెలకువ వచ్చినట్టున్నది. అతడు పక్కమీద పొర్లి "ఏటిరా, గావు కేకలు..." అన్నాడు.

రంగడు మళ్ళీ పెద్దగా పిలిచాడు. అప్పటికీ బదులు పలకకపోయేసరికి అతనికి కోపంవచ్చింది. గొంతు చించుకుని అరిచాడు. "నీకేం పుట్టిందియ్యాళ? బదులు పలకవేం?" అన్నాడు. అయినా లాభంలేకపోయింది. రంగడు కోపంతో సణుగుతూ అలాగే కూర్చున్నాడు. క్రమంగా అతనిలో ఆదుర్దా కలిగింది.

బుచ్చిగాడు లోపలికి వచ్చాడు. "అక్కేది?" అని అడిగి రంగడు బదులు చెప్పకపోయేసరికి గుడిసె చుట్టుపక్కల అంతా తిరిగి చూశాడు. గంగి ఎక్కడా కనబడలేదు.

సూర్యు డుదయించాడు. నది ఆ కాంతులలో రక్తంతో ఎర్రబడినట్టు వైతరిణిలా భయంకరంగా ప్రవహిస్తున్నది. వెంకటేశ్వర్లు కూడా లేచి 'చెల్లమ్మా, చెల్లమ్మా' అని పిలిచాడు.

గంటసేపటికి వారిలో కలవరం బయలుదేరింది. బుచ్చిగాడు వెంటరాగా ఇద్దరూ ఆ పరిసర ప్రదేశాలన్నీ వెదకి చూశారు. రంగడు "నెమలి కంఠం రంగు చీరె కట్టుకున్న అమ్మాయి కనిపించిందా?" అనే అడుగుతున్నాడు "ఏమి టేమిట"ని చేరినవారిని.

ఎండలో చురుకు పాలు హెచ్చింది. ముగ్గురూ వెదికి వెదికి తిరుగుముఖంపట్టారు వెంకటేశ్వర్లూ, రంగడూ 'గంగి

'గుడిసెకు తిరిగి వచ్చి ఉంటుంద'ని ఆశాభావంతో త్వర త్వరగా బుచ్చిగాడి చేతులు పట్టుకుని నడిచి వచ్చారు. కాని గుడిసె శూన్యంగా ఉంది.

రంగడికి ఏడుపు వచ్చింది. చేతులతో మొహం కప్పుకుని పెద్దగా ఏడ్చాడు. వెంకటేశ్వర్లు అతని భుజంమీద చెయ్యి వేసి "ఊరుకోరా! ఎక్కడికి వెళ్ళదు గంగి...వస్తదిలే... వూరుకో..." అని ఊరడించడం మొదలుపెట్టాడు.

చుట్టుపక్కలవారికి కీ విషయం తెలిసి కొందరు సానుభూతి చూపవచ్చారు. బుచ్చిగాడి 'కొత్తమ్మ' తన గడపలో నుంచుని ఎవరితోనో "మరో గుడ్డివాడు కూడా కనిపించడం లేదుగా. ఇకేం... ఇద్దరూ కలిసి ఎటో ఉడాయించి ఉంటారు" అన్నది.

ఊ రంగడు మళ్ళీ లేచి నది ఒడ్డున కేకలువేస్తూ కలయ దిరిగాడు. పిలిచి పిలిచి అతని కంఠం బొంగురు పోయింది. ప్రయోజనం మాత్రం ఏమీ సమకూరలేదు. నది మామూలుగానే వేగంగా తన దారిన తాను ఏ పాపమూ ఎరగనట్లు ప్రవహించిపోతున్నది.

అతడలాగే పిచ్చివాడిలా పరధ్యానంగా కూర్చుండిపోయాడు. సూర్యబింబం నడినెత్తిమీదికి వచ్చినవేళ బుచ్చిగాడు వచ్చి పిలవగా 'నేను రాను పొమ్మ'న్నాడు. 'నే నిక్కణ్ణించీ కదలను' అన్నాడు. తనలో తనే ఏమిటో గొణుక్కున్నాడు.

నదికి దిగువన పదిమైళ్ళ దూరంలో మరునాడు సూర్యోదయ సమయంలో వరదనీరు వెనక్కి తగ్గిన అనువైన చోట గాలం వేసుకుని చేపలు పడుతున్నా డొక పల్లెవాడు. అతనికి దూరంగా ఏదో రంగు గుడ్డ పెద్ద పొదలో చిక్కుబడి ఉండి కనిపించింది. నెమలికంఠం రంగులో ఉన్న ఆ గుడ్డను గురించి అతడు అట్టే ఆలోచించలేదు. గాలంలో చిక్కుకున్న బలిసిన చేపనుపట్టి బుట్టలో వేసుకుని మళ్ళీ ఎర గుచ్చి గాలాన్ని నీళ్ళలోకి విసిరి కూర్చున్నాడు.

* * *

రంగడలా పిచ్చిగా కొన్నాళ్ళు గడిపాడు. ఆ మెట్ల మీదనే రాత్రీ పగలూ తనలో తనే గొణుక్కుంటూ కూర్చుని ఉండేవాడు. గడ్డమూ, జుట్టూ విపరీతంగా పెరిగి, మనిషిలో జవసత్వాలుడిగిపోయి ప్రేత కళ పడింది. వెంకటేశ్వర్లు, బుచ్చిగాడూ ఎవరు పలకరించినా గుర్తుపట్టే దశ కూడా దాటిపోయింది.

నది బాగా తగ్గిపోయింది. అంతకుముందు చుట్టు పక్కల ఊళ్ళను ముంచి పొలాలను ధ్వంసంచేసి విపరీత వేగంతో ప్రళయదృశ్యంగా ప్రవహించిన నది అంతలోనే ప్రోషిత భర్తృకలాగా కృశించిపోయింది. దిగువన దాదాపు పదిహేనుమైళ్ళ వరకూ నది కటూ యిటూ ఒండ్రుమట్టి పెద్ద మేటవేసి ఎండలకు బిగిసి గట్టిపడింది.

ఒకనాటి తెల్లవారుజామున ఎంత పిలిచినా కదలనైనా కదలనందువల్ల బుచ్చిగాడు రంగడి దగ్గరికి వెళ్ళి భుజం పట్టు

కుని కుదిపేసరికి అతని శరీరం నిశ్చలంగా కట్టెవలె ఉండి ఒక పక్కకు వొరిగిపోయింది.

బుచ్చిగాడు ఒక్క క్షణంసేపు భయంతో కొయ్యబారిపోయి నిలబడి తర్వాత వెంకటేశ్వర్లు గుడిసెవైపుకు బాణ వేగంతో పరుగుతీశాడు.

నలుపు - తెలుపు...

భయంకరమైన ఎండ నిరంకుశుడైన ప్రభువు పరిపాలన వలె జీవులను క్షోభపెడుతున్నది. వెచ్చనిగాలి ఉండి ఉండి సుళ్ళుగా సుళ్ళుగా రేగి అసలే ఎండతో తపించిపోతున్న పాంథుల కళ్ళలో దుమ్ముకూడా కొడుతున్నది. నిరంకుశుడూ, నీచుడూ అయిన ప్రభువు పరిపాలనలో భయాందోళనతో నిత్యమూ దాగివుండే సామాన్యజనులవలె మనుష్యులందరూ ఎండవేడిమికి భయపడి ఎక్కడ నీడవుంటే అక్కడ తల దాచుకుంటున్నారు.

రెండవ అంతస్థులో వి శాంతిగా కూర్చునివున్న ముసలాయనకు నిర్జనమైన ఆ వీధిచివరలో ఒక పసివాడు కని